శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## ఆత్మకూరులో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు



**ఆత్మకూరు, జులై 8, ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం ఆత్మకూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్దనున్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, మండల కన్వీనర్లు , పార్టీ నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు భారీగా పాల్గొన్నారు. రైతు బాంధవుడిగా ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేసిన వైఎస్ఆర్ సేవలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. జన్మదిన వేడుకలను ఘనంగానిర్వహించారు.

## కండలేరులో 30.62టీయంసీల నీటిమట్టం



**రాపూరు,జూలై 8, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో బుదవారం ఉదయానికి 30.62 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 850 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 1230 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2110 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఆపదలో ఉన్న మహిళలకు భరోసా కేంద్రాలుగా సఖి సెంటర్లు

- హింసకు గురైన బాధితులకు మరింత నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ
- సఖి సిబ్బందికి ట్రామాఇన్‌ఫార్మ్ కేర్‌పై అవగాహన సదస్సు ప్రారంభించిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్




**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – వైద్యం** సమాజంలో పలు రకాలుగా హింసకు గురైన మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్లు) కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల లెక్చర్ గ్యాలరీలో 14 సఖి వన్ స్టాప్ కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన ట్రామాఇన్‌ఫార్మ్ కేర్, మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ, హింసకు గురైన బాధితులకు సమర్థవంతమైన సేవలందించే విధానాలు తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ** ఆపదలో ఉన్న మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్)లు చివరి ఆశ్రయ కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఒకే చోట వైద్య సేవలు, న్యాయ సహాయం, పోలీసు సహకారం, ఎఫ్‌ఐఆర్ నమోదు, కౌన్సిలింగ్ వంటి సమగ్ర సేవలను అందిస్తూ బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. శారీరక వేధింపులు, లైంగిక దాడులు, గృహహింస, యాసిడ్ దాడులు వంటి వివిధ రకాల హింసకు గురైన మహిళలను అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా ఎలా సంప్రదించాలి, వారి మానసిక స్థితిని అర్థం చేసుకుని ఎలా సహాయపడాలి, తిరిగి మానసిక గాయం కలగకుండా (రీట్రామాటైజేషన్) ఎలా సేవలు అందించాలనే అంశాలపై ఈ శిక్షణలో సమగ్ర అవగాహన కల్పించినట్లు వివరించారు. ఇలాంటి బాధాకరమైన కేసులను నిరంతరం నిర్వహించే సఖి సిబ్బంది కూడా తమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, పని ఒత్తిడిని అధిగమిస్తూ సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా స్వీయ సంరక్షణ పద్ధతులపై కూడా ఈ శిక్షణలో మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి రాయలసీమ ప్రాంతం వరకు ఉన్న 14 జిల్లాల సఖి (వన్ స్టాప్ సెంటర్) లీగల్ అడ్వైజర్లు, కౌన్సిలర్లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారని, వారి వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించి మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ అవగాహన సదస్సు ప్రధాన ఉద్దేశమని డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధిత మహిళలకు మరింత సానుభూతితో, మానవీయ దృక్పథంతో, సమర్థవంతమైన సేవలు అందించేందుకు సఖి (వన్ స్టాప్ సెంటర్) సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సులో పాల్గొన్న సఖి సిబ్బంది నిపుణులతో సందేహాలను నివృత్తి చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. తొలుత నెల్లూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మహిళా ఛైర్ పర్సన్ రాయపాటి శైలజకు నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు మహిళలు తమ సమస్యలపై మహిళా కమిషన్ ఛైర్పర్సన్‌కు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ అడ్వైజర్ రావూరి సూయజ్, సిబ్బంది మాధవీ లత, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే.మాధవి, అడ్వకేట్ నాగరాజవర ప్రసాద్, డిఎస్పీ గిరిధర్, డాక్టర్ శరత్ కృష్ణ, డాక్టర్ ప్రసన్న లక్ష్మి తదితర నిపుణులు చట్టపరమైన అంశాలు, పోలీసు వ్యవస్థ సహకారం, మానసిక ఆరోగ్య అంశాలపై సఖి సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. 14 జిల్లాలకు చెందిన వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్లు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నెల్లూరులో విద్యార్థులకు మంత్రి నారాయణ భారీ కానుక

- వివరాలు వెల్లడించిన డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్
- జూలై 14న రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో 7,000 మందికి ఉచిత సైకిళ్ల పంపిణీ
- మంత్రి నారాయణ ఉదారత
- సొంత డబ్బులతో పేద విద్యార్థులకు సైకిళ్ల వితరణ
- విఆర్‌సి గ్రౌండ్స్ విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – వైద్యం** పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారని నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ కొనియాడారు. బుధవారం స్థానిక వి.ఆర్.సి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మంత్రి నారాయణ తాను చిన్నతనంలో హరినాథపురంలో నుంచి విఆర్‌సి గ్రౌండ్‌కు నడిచి వచ్చి చదువుకుంటూ పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ, ఏ పేద విద్యార్థి కూడా దూరం భారం వల్ల ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వైపు నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా, తన సొంత డబ్బులు, కుటుంబ సంపాదనతో ఒక్కొక్కటి దాదాపు 6,000 విలువ చేసే సైకిళ్లను హీరో కంపెనీ వారితో స్వయంగా మాట్లాడి విద్యార్థినులకు, విద్యార్థులకు విడివిడిగా ప్రత్యేకంగా డిజైన్ చేయించారని రూప్ కుమార్ యాదవ్ తెలిపారు. నెల్లూరు నగర పరిధిలోని 15 హైస్కూళ్లు, రూరల్ పరిధిలోని 8 హైస్కూళ్లు కలిపి మొత్తం 23 హైస్కూళ్లకు చెందిన 8, 9, 10 తరగతుల చదువుతున్న సుమారు 7,000 మంది విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారని, ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఎక్కడా లేని విధంగా రాబోయే మంగళవారం, జూలై 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే భారీ బహిరంగ కార్యక్రమంలో ఒకే రోజు ఈ 7,000 సైకిళ్లను పంపిణీ చేయబోతున్నారని ఆయన వివరించారు. మంత్రి నారాయణ కుమార్తె షరణి పూర్తి బాధ్యతలతో ఈ విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగి, మూతపడి ఉన్న వి.ఆర్. హైస్కూల్‌ను నారాయణ గెలిచిన తర్వాత దాదాపు 18 కోట్ల పైన సొంత ఖర్చుతో కొంత కుటుంబం, కొంత ఎన్‌సిసి వారి సహాయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కార్పొరేట్ స్థాయిని మించి తీర్చిదిద్దారని గుర్తుచేశారు. అలాగే మూలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల డిఎస్ఆర్ హైస్కూల్‌ను కోట్లు ఖర్చు పెట్టి దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, డిఎస్ఆర్ గ్రూప్ వారు, ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దారని, ముస్లిం విద్యార్థుల కోసం సిద్ధమవుతున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనులను కూడా షరణి పర్యవేక్షిస్తున్నారని రూప్ కుమార్ యాదవ్ తెలిపారు. జూలై 14న జరిగే ఈ సైకిళ్ల పంపిణీ మహోత్సవ కార్యక్రమానికి మంత్రి నారాయణతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. విద్యా రంగం నుంచే వచ్చిన ప్రతిపక్ష నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని, విద్యా వ్యవస్థ బాగుపడటానికి మంచి సూచనలు ఉంటే ఇవ్వాలని, పేద పిల్లల భవిష్యత్తు కోసం ఇంతలా తపిస్తున్న మంత్రి నారాయణకి ప్రజల, భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

- కలెక్టర్ చేతుల మీదుగా హాస్టల్‌కు వాషింగ్ మెషీన్‌ను విరాళంగా అందజేసిన ఐటీ ఉద్యోగి



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – కలెక్టరేట్** స్థానిక ఫతేఖాన్ పేటలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం తనిఖీ చేశారు. మద్రాస్‌లో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేష్ పోలుదాసు సుమారు రూ.10 వేల విలువైన, 7 కిలోల సామర్థ్యం గల లాయిడ్ వాషింగ్ మెషీన్‌ను వసతి గృహానికి విరాళంగా అందజేయగా, జిల్లా కలెక్టర్ దానిని ప్రారంభించి దాతను అభినందించారు. అనంతరం వసతి గృహంలోని వివిధ సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ నివసిస్తున్న విద్యార్థినుల వివరాలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి పి. వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో 60 మంది కళాశాల విద్యార్థినులు ఉంటున్నారని, కొత్త అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ఆమె వివరించారు. విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఉంటే నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బైరి శ్రీనివాస్, చల్లగుంట్ల సాయిప్రసాద్, ముత్తూరు శ్రీహరి, పులపర్తి పెంచల ప్రసాద్, పచ్చ ప్రవీణ్ కుమార్, బీసీ బాలికల వసతి గృహ వార్డెన్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

- కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త** కోవూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రధాన ధ్యేయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## దేవాలయానికి ప్రభుత్వ భూమి పరిశీలించిన జెసి

డబుల్ ఓటు కార్డు స్వచ్ఛంధంగా తొలగించేందుకు సహకరించాలి : జెసి



**కలువాయి జులై 8 ప్రభాతవార్త** మండలంలోని దాసరిపల్లి,పెరమకొండలో నూతనంగా నేర్మిస్తున్న శివాలయానికి ప్రభుత్వ భూమి అవసర నిమిత్తం కమీటి సభ్యులు ప్రభుత్వాన్ని అభ్యర్దించడంతో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు స్దలాన్ని పరిశీలించారు.అనంతరం కలువాయి తహసిల్దారు వారి కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతు 99 శాతం జిల్లాలో బిఎల్‌ఒల ద్వారా ఇంటింటికి అందించడం జరిగిందని అన్నారు. అదే విధంగా జిల్లాలో 66 శాతం ఎలిమిరెట్ పాంప్స్ పూర్తి అయ్యాయయని అన్నారు. ఈనెల 14 వ తేదిలోపు ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి అయ్యేందుకు అంగన్‌వాడీ వైద్యసిబ్బంది కూడా చేయూతగా పనిచేస్తున్నారని పేర్కున్నారు.
మండలంలో తహసిల్దారు, ఎంపిడిఒలు బిఎల్‌ఒలతో సమన్వయం చేసుకొని లక్ష్యం పూర్తి అయ్యేదిశగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.డబుల్ ఓటు కార్డు స్వచ్ఛంధంగా తొలగించేందుకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు కృష్ణారెడ్డి,డిప్యూటి తహసిల్దారు వెంకటేశ్వర్లు,సిబ్బంది పాల్గోన్నారు.

## సమర్థవంతంగా అన్న క్యాంటీన్ల నిర్వహణ

- రాష్ట్ర సీఈఓ వంశీధర్



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – కలెక్టరేట్** పేద ప్రజల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణ సమర్థవంతంగా చేయాలని అన్న క్యాంటీన్ల రాష్ట్ర సీఈఓ వంశీధర్ సూచించారు. ప్రధాన నగరాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మండల కేంద్రాలలో కూడా వాటిని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై బుధవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో జరిగిన పంచాయతీ అధికారి వసుమతితో పాటు ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. అన్న క్యాంటీన్ల సీఈఓ వంశీధర్ ఈ సందర్భంగా గ్రామీణ అన్న క్యాంటీన్ల ప్రామాణిక నిర్వహణ విధానాలు, క్యాంటీన్ల నిర్వహణ, పర్యవేక్షణ, సమన్వయం, క్యాంటీన్ వారీగా జారీ చేస్తున్న టోకెన్ల వివరాలు, అలాగే ప్రజా అభిప్రాయ సేకరణ వ్యవస్థ ద్వారా నమోదవుతున్న ప్రజల అభిప్రాయాలపై సమగ్రంగా వివరించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో విరాళాల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం స్థానిక దాతలను ప్రోత్సహించడం, క్యాంటీన్ల అభివృద్ధిలో ప్రజల సహకారాన్ని మరింత విస్తరించడం, అలాగే అన్న క్యాంటీన్ల అడ్వైజరీ కమిటీలలో సామాజిక సేవా దృక్పథం కలిగిన ఫిలాంత్రపిస్టులను సభ్యులుగా భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. సదస్సులో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి వసుమతి గ్రామీణ అన్న క్యాంటీన్ల సమర్థవంతమైన నిర్వహణ, పర్యవేక్షణ, పరిశుభ్రత, నాణ్యమైన ఆహార పంపిణీ, సమయపాలన, ప్రజలతో సమన్వయం తదితరాలపై తెలియజేసి అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఎంపీడీవోలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి క్యాంటీన్ల పనితీరును మరింత మెరుగుపరచాలన్నారు.

## డీసెట్‌లో మెథడ్స్ విద్యార్తికి స్టేట్ పస్ట్ ర్యాంకు





**కావలి, జులై 8 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ విడుదల చేసిన డీసెట 2026 ఫలితాల్లో కావలి మెథడ్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాష్ట్ర మొదటి ర్యాంక్‌తో పాటు 1000లోపల 10ర్యాంకులు సాధించడం జరిగింది. జి.కవిత రాష్ట్ర పస్ట్ ర్యాంకు, కె.మౌనిక 78, ప్రణీ 83, ఎం.ఆకాష్ 147, సిహెచ్ మహేంద్ర వర్మ 297, వి.శృతి 408, పి.శివ 419, కె.లక్ష్మి ప్రణతి 654, యు.గౌతమి 841, పి.దుర్గా 906, ఎస్‌కె. జాకీర్‌హుస్సేన్ 1563 ర్యాంకులతో అత్యుత్తమ ఫలితాలను సాధించడం జరిగింది.

**డైరెక్టర్ ఐ.శ్రీలక్ష్మి మాట్లాడుతూ** ఇంతటి ఘన విజయంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, సంస్థ అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్టేట్‌పస్ట్ ర్యాంకు సాధించిన శ్రీలక్ష్మి జన్మదినం కావడంతో అందరూ కలసి ఎంత ఆనందంగా స్వీట్లు పంచిపెట్టుకొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఉదయగిరిలో అంబరాన్నంటిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు



**ఉదయగిరి, జులై 8, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలో మాజీ ముఖ్యమంత్రిదివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 77 కేజీల భారీ కేక్ కట్ చేసి స్థానిక ట్యాంక్ బండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మరుపురాని మహానేత పేదల గుండెల్లో గూడు కట్టుకున్న మహానుభావుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అభాగ్యులకు ఆపద్బాంధవుడు అయి, ఫీజు రియింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, ఉచిత కరెంటు ద్వారా అన్నదాతలకు అండగా నిలిచి, జల యజ్ఞం ద్వారా పంట పొలాలు సస్యశ్యామలం చేసి, 108, 104 లు ఏర్పాటు చేయడం ద్వారా ఎందరో నిరాశ్రయులు జీవితాల్లో వెలుగులు నింపి తాను చనిపోయినా ఆయన చేపట్టిన సంస్కరణలు ద్వారా ఇప్పటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దేవుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిడిముసలి బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం



**ఇందుకూరుపేట, జూలై 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నిడిముసలి గ్రామం బీసీ కాలనీలో గత కొన్ని రోజులుగా వేధిస్తున్న తాగు నీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలో ఉన్న తాగునీటి బోరు అకస్మాత్తుగా రిపేరు రావడంతో స్థానిక నివాసి తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి కాలం ముగిసినా, నిత్య అవస రాలకు నీరు లేక కాలనీ వాసులు, మహిళలు కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్య స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో కాలనీ వాసులంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

**– సమస్య వినగానే స్పందించిన మధుసూదన్ రెడ్డి.** ఈ నేపథ్యంలో కాలనీ ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిపై గ్రామస్తులు, మహిళలు అంతా కలిసి శనివారం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి నివాసానికి తరలివెళ్లారు. తమ కాలనీలో బోరు పాడైపోయి, తాగేందుకు చుక్క నీరు కూడా దొరకడం లేదని, తక్షణమే స్పందించి సమస్యను తీర్చాలని ఆయనను వేడుకున్నారు. గ్రామస్తుల కష్టాలను ఆలకించిన మధుసూదన్ రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రభుత్వ నిధులు లేదా అధికారుల ప్రక్రియ కోసం వేచి చూడకుండా, ప్రజల తాగునీటి అవసరం అత్యంత ముఖ్యమైనదని భావించి ఆయన తక్షణ నిర్ణయం తీసుకున్నారు.

**– రూ. 20,000 సొంత నిధులతో మరమ్మతులు.** దువ్వూరు మధుసూదన్ రెడ్డి తన సొంత నిధులు రూ. 20,000 (ఇరవై వేల రూపాయలు) వెచ్చించి, వెంటనే బోరు రిపేరుకు అవసరమైన సామాగ్రిని తెప్పించారు. యుద్ధప్రాతిపదికన మెకానిక్‌లను పిలిపించి, పాడైపోయిన బోరు మోటార్‌ను, పైపులను బాగు చేయించారు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే బోరును పునరుద్ధరించి, కాలనీ వాసులకు తాగునీరు అందుబాటులోకి వచ్చేలా చేశారు.

**– ఏ సమస్య వచ్చినా ఆయనే మాకు దిక్కు** గ్రామస్తులు బోరు తిరిగి ప్రారంభమై నీరు రావడంతో బీసీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, మహిళలు మాట్లాడుతూ మా గ్రామానికి ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఉన్నా స్పందించే ఏకైక నాయకుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాత్రమే. అధికారులు పట్టించుకోని తరుణంలో ఆయన తన సొంత డబ్బులతో మా నీటి కష్టాలు తీర్చారు. గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన ఎల్లప్పుడూ ముందుంటారు అని కొనియాడారు. మధుసూదన్ రెడ్డి చూపిన చొరవకు కాలనీ వాసులంతా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ముఖ్య నేతలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మరణం లేని - మరుపు రాని మహానేత వైఎస్ ఆర్ : కాకాణి గోవర్ధన్ రెడ్డి



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – వైద్యం:** ఎప్పటికి మరణం లేని, మరుపు రాని మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఉమ్మడి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లావైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ పొట్టి శ్రీరా ములు నెల్లూరు జిల్లావైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మహానేత దివంగత మాజీ ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, జోనల్ విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా భారీ కేక్ కట్ చేసి వైఎస్ఆర్ సీపీ నేతలకు పంచిపెట్టారు.అనంతరం జిల్లా వైసీపీ కార్యాలయంలో పేదలకు మాజీ మంత్రి కాకాణి ఆధ్వర్యంలో వస్త్ర దానం చేశారు. అలాగే కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశలు, ఆశయాలు సజీవంగా ఉన్నాయని,వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు .ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉన్నాయన్నారు.పేదల అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్ళుగా భావించి తపించిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో పార్టీ జిల్లా కార్యాలయంలో వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించామని, తండ్రి స్ఫూర్తి, ఆదర్శాలతో వైఎస్సార్ ఆశయాల సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ పాలన ముగిశాక, చంద్రబాబు చీకటి పరిపాలన మళ్లీ మొదలైందనుకున్న తరుణంలో జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు ఆశాకిరణంగా కనిపించారని గుర్తు చేశారు. ప్రజలు అధికారం అప్పగించగానే జగన్ పేదల గురించి ఆలోచించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజలు చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మి ఓటు వేసినా, ఓటు వేసిన మరుసటి క్షణం నుంచే జగన్‌ని ఎందుకు దూరం చేసుకున్నామా అనే ఆవేదన వారిలో కనిపిస్తోందన్నారు. రోడ్డుపైకి వస్తే కేసులు పెడతామని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటే కక్షసాధింపులకు పాల్పడతామని బెదిరించినా లెక్కచేయకుండా నెల్లూరు జిల్లావ్యాప్తంగా అభిమానులు తరలివచ్చారని తెలిపారు. జిల్లాలోని ప్రతి వైఎస్సార్ విగ్రహం వద్దకు ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తరలివెళ్లి ఘనంగా నివాళులర్పిం చారన్నారు. ఒక వ్యక్తి మనల్ని వదిలి 17 సంవత్సరాలైనా, ఈరోజు కూడా ఆయనను తలచుకుని కన్నీరు పెడుతున్నారంటే ప్రజల గుండెల్లో ఆయన ముద్ర ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదన్నారు. పై లోకంలో ఉన్న మహనీయుడు రాజశేఖర రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటు న్నామన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంపూర్ణ ఆశీస్సులు జగన్ మోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలంతా మళ్లీ జగన్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.వైఎస్సార్ ఆశయాలు, దీవెనలతో జగన్ మోహన్ రెడ్డి తిరిగి జనరంజకమైన పాలన సాగించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాన్నారు.పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులర్పించిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసు న్నామన్నారు. అనంతరం పూజితమ్మ మాట్లాడు తూ వైఎస్ రాజశేఖర రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపో యిన మహా నాయకుడు అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈరోజు మన మధ్య లేకపోయినా, ఆయన చేసినమంచి పనుల వల్ల ఆయన పుట్టినరోజును మనమంతా ఒక వేడుకలా,పండుగలా జరుపుకుంటు న్నామన్నారు. మహానేత వైఎస్సార్ చేసిన మంచి అందరి మనసుల్లో ఉంటుంది, ప్రతి ఇంటికీ, ప్రతి మనిషికీ, ప్రతి వర్గానికి ఆయన సంక్షేమ ఫలాలను అందించారని తెలిపారు.వైఎస్సార్ వంటి గొప్ప నాయకుడిని కోల్పో వడం ఇప్పటికీ గుండెల్లో ఒక ఆరని,తీరని బాధగా మిగిలిపోయిందని విచారం వ్యక్తం చేశారు.రాజశేఖరరెడ్డి వదిలివెళ్లిన ఆశయాలను,పనులను పూర్తి చేయడానికి ఆయన వారసుడిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మనకు ఉన్నా న్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా, వైఎస్సార్ కంటే కూడా మెరుగైన రీతిలో జగనన్న పాలన అందిస్తుండటం మనందరికీ ఎంతో సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. వైఎస్సార్ చేసిన పనుల గురించి చెప్పడానికి సమయం సరిపోదు,కానీ ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన ఏకైక నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ తెచ్చిన ఆ పాలనను తిరిగి జగనన్న అదేవిధంగా కొనసాగించారని,మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పిస్తూ ఆయన ఆశయాలను నెరవేరుస్తున్న జగనన్నకు ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

## మసీదుపేటలో లో వోల్టేజ్‌తో ప్రజల ఇబ్బందులు



**రాపూరు,జూలై 8, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీ పరిధిలోని మసీదుపేట గ్రామంలో గత కొంత కాలంగా తీవ్రమైన లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వోల్టేజి సరిగా లేకపోవ దంతో తరచూ ఇళ్ళలో వున్న ఫ్యాన్లు, ఎ.సీలు, ఇతర గృ హోపకరణాలు కాలిపోతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్సఫార్మర్‌లు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు వారు చెపుతున్నారు. ఈ విషయమై ఎన్ని సార్లు విద్యుత్ అధికారులకు చెప్పినప్పటికి వారు పట్టించుకోవడం లేదని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో లో వోల్టేజి సమస్య పరిష్కారానికి వినియోగానికి అనుగుణంగా ట్రాన్సఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

## శ్రీ వెంగమాంబ దర్శించుకున్న చల్లా

**వింజమూరు, జూలై 8, ప్రభాతవార్త :** దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసియున్న శ్రీ వేంగమాంబ పేరంటాలు అమ్మవారిని ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్ కాకర్ల సురేష్‌తో కలిసి వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ దర్శించుకున్నారు అమ్మవారి బ్రహ్మోత్సవాలులో భాగంగా బుధవారం కళ్యాణోత్సవం నిర్వహించారు ఈ కళ్యాణానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ మెట్ట ప్రాంత వాసులు అమ్మవారిని నమ్మి కొలుస్తూ కొర్కెలు తీర్చుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా అమ్మవారికి కృపాకటాక్షాల వల్ల శాంతి సౌభాగ్యాలు వెలసిల్లి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆయన కోరుకున్నారు అమ్మవారి దయవల్ల రైతన్నలు సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.

## రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీలలో అలరించిన నృత్యప్రదర్శనలు



**కావలి, జూలై 8 ప్రభాతవార్త :** ప్రపంచ రక్తదాన దినోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీవాసివి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీలలో భాగంగా బుధవారం నృత్యపోటీల్లో సుమారు మందమంది బాల బాలికలు పాల్గొని, తమ ప్రతిభను చాటారు. వైయుక్తిక బృందం నృత్యపోటీలలో పట్టణానికి చెందిన పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రక్తదాన అవసరాలు తెలుసుకుందామా రక్తదానమిచ్చి సాటివారిని ఆదుకుందామా, ప్రతి తనువులో ప్రవహించే నది ప్రాణం పోసే సంజీవని అది, రక్తదానమంటేనే ప్రాణదానం అంటూ రక్తదాన అవవ్యకతను చాటే పలు పాటలకు నృత్య ప్రదర్శనలు పోటా పోటీగా ఇచ్చారు. ఈ పోటీలను రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ జి.హరనాథ్, జమున ప్రముఖ గాయకులు రామ చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యయులు సుబ్బరాయశర్మ, కళ్యణి, ప్రముఖ నృత్య కళాకారిణి రుష్యి నిర్వ హించారు. కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాస్, వైస్ ఛైరెనమన్ కె.హరినారపరెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**గూడూరు, జూలై 8, ప్రభాతవార్త :** గూడూరు మండల పరిధిలోని మధురెడ్డి కాలనీ పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీసుల కథనం మేరకు మృతుడు వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృత దేహం పై ఎటువంటి గాయాలు లేవన్నారు. మృతుడు షార్ట్‌ను ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

**– 99 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి – 82 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది**

**– ఎంపీడీవో వి. శైలేంద్ర కుమార్**



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని నెల్లూరు రూరల్ మండల ఎంపీడీవో వీ. శైలేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని మాదరాజు గూడూరు, పెనుబర్తి, కలివెలపాలెం, కాకుపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే ఓటర్లు 100 శాతానికి చేరువలో ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు అందజేశారని తెలిపారు. 82 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఈ నెల 14 వరకు మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువు ఉందని మిగిలిన ఓటర్లు గమనించి త్వరితగతిన పూర్తిచేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా కాపాడుకోవాలన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరితగతిన 18 గ్రామాలలో 82 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసిన బిఎల్ఓలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## అహల్య రంగనేకర్ సేవలు మరువలేనివి

**– శ్రామిక మహిళా సంఘం**




**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** అహల్య రంగనేకర్ 104వ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు జేమ్స్ గార్డెన్ సిఐటియు ఆఫీస్‌లో శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈమె 1922 జూలై 8 తారీకు పూణేలో జన్మించారు. కమ్యూనిస్టు పార్టీ వైపు చదువుకున్న రోజుల్లోనే ఆకర్షితులై 1943 సంవత్సరాలలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో చేరారు. ఆమె మహారాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారు. 1943 పరేల్ మహిళా సంఘం స్థాపకులలో ఆమె ఒకరు. అనతి కాలంలోనే జనావాది మహిళా సంఘంగా మారింది. మహారాష్ట్రలో ఐద్వా అగ్ర నాయకురాలుగా పనిచేసింది. ముంబై నార్త్ సెంట్రల్‌కు భారత పార్లమెంటు సభ్యురాలుగా 1977 నుండి 1980 వరకు పనిచేసింది. బొంబాయి కార్పొరేషన్‌లో 19 సంవత్సరాలు పాటు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. సిపిఎం పార్టీ మహారాష్ట్ర కార్యదర్శిగా కేంద్ర కమిటీ సభ్యులుగా సిఐటియు కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. నిరంతరం మహిళా కార్మికుల సమస్యలపై ప్రజా సంఘాల్లో పనిచేసే వాళ్లు కాఫీ తోటల్లో కూలి రేట్లు కు వ్యతిరేకంగా పోరాటం చేశారు. భవిష్యత్తులో అహల్య రంగ్ నేకర్ గారిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ టివి ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్కే రెహానా బేగం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే మస్తాన్ బీ, జిల్లా కార్యదర్శి ఐద్వా టి శివకుమారి, జిల్లా అధ్యక్షులు ఐద్వా కే పద్మ, ఐదవ నగర కార్యదర్శి సుజాతమ్మ, కామాక్షమ్మ ఎల్వి శేషమ్మ, ఎస్ కే శంషాద్, మల్లెం తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన రెండవ రోజు



**ఉదయగిరి, జూలై 8, ప్రభాతవార్త :** మం డల కేంద్ర మైన ఉదయగిరి ఆర్టీసీ డిపో ఎదుట రెండవ రోజు ప్రైవేటీకరణపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన కార్యక్రమం నిర్వహిం చారు.మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రైవేటీకరణను పూర్తిగా ఉపసంహరి ంచుకోవాలని జేఏసీ ఆధ్వర్య ంలో రెండవ రోజు ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఉదయగిరి డిపో ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాపలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీలో కాకుండా విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పి నడిపించాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహ రించుకో వాలన్నారు. లేకుంటే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు భవిష్యత్తులో ఆర్టీసీ నడపడమే కష్టమ వుతుందన్నారు. ఆన్ డ్యూటీలో ఉన్న సిబ్బందిపై దాడి చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పీఆర్సీ కమీ షన్‌ను వెంటనే నియమించాలని శ్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీకి పడిన బకాయి చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఆర్టీసీ యూనియన్ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, శంకర్, వెంకటకృష్ణ, నాగరాజు, జయంతు, రాములు, శ్రీనివాసులు, శివ, శ్రీను, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణయుగం సృష్టించిన మహానేత వైఎస్ఆర్

**– ఘనంగా వైస్సార్ 77వ జయంతి వేడుకలు**



**వింజమూరు, జూలై 8, ప్రభాతవార్త :** నూటికో కోటికో ఒక రేపుడతారు. అలాంటి పుణ్యమూర్తి, ప్రజానేత డా. వైస్ రాజశేఖర్ రెడ్డి 77వజయంతి వేడుకలను బుధవారం వింజమూరులో వైసీపీ కుటుంబం ఘనంగా నిర్వహించింది. మండల వైసీపీ కన్వీనర్ రేవునూరుశ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని వైస్సార్ విగ్రహం వద్ద కార్యక్రమం జరిగింది. ముందుగా వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేకును కట్ చేసినాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి మాట్లాడుతూ వైస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న 5 ఏళ్లు రాష్ట్రానికి స్వర్ణయుగం. యువతకు ఉపాధి, రైతన్నకు భరోసా, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇల్లు, మహిళా సాధికారత, గ్రామీణ అభివృద్ధి వంటి వందలాది సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు అని కొనియాడారు.వైస్సార్ మరణానంతరం ఆయన తనయుడు, వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి తండ్రి ఆశయాలనే మేనిఫెస్టోగా తీసుకొని పాలించారని నేతలు తెలిపారు. జగనన్న పాలనలో నవరత్నాలు, అమ్మ ఒడి, రైతు భరోసా, వైయస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం లాంటి సంక్షేమ పథకాలతో తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రతి పేద ఇంటికి నేరుగా లబ్ది చేకూర్చిన ఏకైక నేత జగనన్నఅని వారు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి వైస్సార్ జగనన్న సంక్షేమ పాలనను కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మండల కన్వీనర్లు మలిరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, మద్దూరుచిన్నికృష్ణారెడ్డి, మద్దూరు లక్ష్మి ప్రసాద్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి గణ పం రమేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తాటిచెట్ల కాలేశా, రోడ్డ కొండయ్య, యువ నాయకులు బయ్యపు రెడ్డి విజయ్ కృష్ణారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పబ్లిసిటీ అధ్యక్షులు అంకినపల్లె నరసింహారెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, ఎత్తపు రాజేష్, సూరం వినోద్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మహానేత వైఎస్సార్

**: నార్త్ రాజుపాలెంలో 77వ జయంతి వేడుకలు**

**: మాజీ మంత్రి ప్రసన్న, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు**





**కొడవలూరు, జూలై 8 ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జ యంతి వేడుకలను కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘ నంగా నివాళుల ర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్ల పరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, కో వూరు నియోజకవర్గ వైసీపీ యువ జన విభాగం అధ్యక్షు దునల్ల పరెడ్డి రజత్ కుమార్ రెడ్డి పాల్గొన్నా రు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా చేసు కుని ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబ ర్స్‌మెంట్, 108, 104 అంబులెన్స్ సేవలు, రైతులకు రుణమాఫీ వంటి పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి సంఘం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్, కృష్ణపట్నం పోర్టు వంటి కీలక ప్రాజెక్టులకు ఆయన విశేష కృషి చేశారని గుర్తు చేశారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగిస్తూ పేదలసంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని, నాడు–నేడు వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేశారని తెలి పారు. రాష్ట్ర అప్కాఫ్ మాజీ చైర్మన్, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరుఅనిల్‌బాబు, కొడ వలూరు మండల వైసీపీ అధ్యక్షుడు చిమటా శేషగిరి, ఎంపీపీగాలి జ్యోతి, మాజీ సర్పంచ్ బొచ్చుసుప్రి య స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు,కార్యకర్తలు, మహిళలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## హంస వాహనంపై రామలింగేశ్వరుడు

**విడవలూరు, జూలై 8 ప్రభాతవార్త:** మండలంలోని రామతీర్థం గ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.రాత్రి స్వామి, అమ్మవార్లు హంస వాహనంపై గ్రామ వీధుల్లో భక్తుల నడుమ వైభవంగా ఊరేగారు. మహిళలు కాయ కర్పూరాలతో హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.ఈ ఉత్సవాలకు విరాళదాతలుగా వరిణి గ్రామానికి చెందిన కందికట్టు సులోచనమ్మ, మయూరమ్మ జ్ఞాపకార్థం సురేష్ కుమార్, అశోక్ కుమార్, శిఖీవాహన్ వ్యవహరించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, శ్రీనివాసశర్మ, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు



**అనుమసముద్రంపేట,జూలై8,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలను వైఎస్ఆర్‌సిపి నాయకులు ,కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్‌పేట వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి, జడ్పీటిసి సభ్యురాలు పందిళ్ళపల్లి రాజేశ్వరమ్మ సూచనలతో ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమి వెంకటరమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ వైఎస్ఆర్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ప్రజలకు అందించిన సంక్షేమ పాలన, రైతులు, పేదలు, బడుగు , బలహీన వర్గాల అభ్యున్నతికిచేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కేక్‌తోపాటు స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు , కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ జయంతి వేడుకలు



**అల్లూరు, జూలై 8 ప్రభాతవార్త :** అల్లూరు పాత బస్టాండ్ సెంటర్‌లో దివంగత ముఖ్య మంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు భుదవారం వైఎస్ఆర్ సిపి సెంట్రల్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్తన్‌రెడ్డి, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం బాణాసంచా వేడుకలు నడు మ భారీ కేక్‌కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ము ఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజేశేఖర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. అల్లూరు వన్‌టౌన్ వైసిపి కన్వనర్ దండా క్రిష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్య దర్శి నీలం సాయికుమార్, రూరల్ కన్వీనర్ బీద రమేష్‌యాదవ్, గోసల గోపల్‌రెడ్డి, పెనుమల్లి ప్రతాప్‌రెడ్డి, ఎర్రటిపల్లి శేఖర్‌రెడ్డి, మేద మాధవ్ గుండవరపు సుధాకర్‌రెడ్డి,మాధవరావు, పప్పు సుధాకర్, మొగలపల్లి సురేష్, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు రాజశేఖర్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల హృదయాల్లో వైఎస్ఆర్

**వైకాపా సిఇసి సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి**




**కోట,జూలై 8 ప్రభాతవార్త** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004 నుంచి 2009 వరకు ప్రజా రంజకంగా పాలన సాగిందని వైకాపా సిఇసి సభ్యులు పెర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతిని ఆయన బుధవారం న్యూఢిల్లీలోని ఎపి భవన్‌లో జరుపుకున్నారు. వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళిరించారు. అనంతరం శ్యామ్ ప్రసాద్ రెడ్డి కెక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహానేత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీ కరించిన వెంటనే రైతులకు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకంపై తొలి సంతకం చేసి దేశంలోని తొలసారి రైతులు ఉచిత కరెంటు అందించిన గొప్ప నాయకుడుని పేర్కొన్నారు. అలాగే పేద ప్రజల ఆరోగ్య కోరకు ఆరోగ్యశ్రీ పథకం, పేద విద్యార్థుల కొరకు ఫీజు రియింబర్స్‌మెంట్ అత్యవసర వైద్యం కొరకు 108 తీసుకొచ్చారని చెప్పారు.మహిళ ఆర్థి స్వావలంబన కోసం డ్వాక్రా రుణాలు పావలా వడ్డీ పథకం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ డిప్యూటి డైరెక్టర్, (స్పోర్ట్స్) హిమబిందు రూరల్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ అధికారి మదన్ మో హన్,వైఎస్ఆర్.అభిమానుల, వివిధ రంగాల ప్రఖులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న మహానేత వైఎస్ఆర్



**మనుబోలు జూలై 8 ప్రభాతవార్త** మండల కేంద్రమైన మనుబోలులో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77 వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కేకు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన 108 పథకంతో ఎంతోమందికి ప్రాణదాత అయ్యారన్నారు. అదే విధంగా విద్యార్థులకు పీజు రియంబర్స్ మెంట్ ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు.రైతులకు రుణమాపీ చేసిన ఘనత ఆయనకే దక్కు తుందని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేకర్‌రెడ్డి ,దాసరి బాస్కర్‌గౌడ్, ఎంపిపి వజ్రమ్మ, గ్రామ అధ్యక్షులు ముంగర రవీంద్రరెడ్డి, బొమ్మిరెడ్డి మధురెడ్డి, బొమ్మిరెడ్డి పార్దు కిషోర్‌నాయుడురెడ్డి, తుపాకుల గిరి,గుంజి రమేష్‌కిషోర్, కుదు ముల వెంకటరమణయ్య, గౌడ పరమళ శివరాం,మల్లికార్జున పెద్దఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## కోవూరువారిపాలెం అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

**– చిన్నారులకు పలక బలపాలు పంపిణీ, హోమియో మందులు పంపిణీ**



**చిల్లకూరు, జూలై 8, ప్రభాతవార్త :** స్వర్గీయ ముప్ప వరపు ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం మండలంలోని కోవూరు వారిపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కోట మం డలం చెందోడు గ్రామానికి ఎంవి రావు ఫౌండేషన్ వారు నిర్వహించారు. ముప్పవరపు ఆదిలక్ష్మి చనిపోయిన తేదీని పురస్కరించుకుని వారి జ్ఞాపకార్థం ఎంవి రావు ఫౌండేషన్ వారి సౌజన్యంతో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు బలపాలు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. తదుపరి చిన్నారులకు గ్రామస్తులకు ఉపాధ్యాయులకు వేసవిలో వచ్చే అమ్మవారు, చికెన్ పాక్స్ రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వారికి హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోవూరువారిపాలెం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు అంగన్వాడి టీచర్, ఆయా, ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజ యలక్ష్మి, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్



**గూడూరు, జూలై 8, ప్రభాతవార్త :** పార్టీలకతీతంగా పేద వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్య చదివేందుకు ఆర్థికంగా సహాయ పథకాన్ని ప్రవేశపెట్టిన యుగపురుషుడు అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగ మురళి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైయస్సార్ జయంతి సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగ మురళి, నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరీగ మురళి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ జయంతి పండుగలా జరుపుకుంటున్నారని ఆ మహానీయుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతాడని అన్నారు. పేద వారందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి ఉన్నతికి ఎంతో దోహదపడ్డారని తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి అరాచకపాలన సాగుతుందని కొంతమంది పోలీసు అధికారులు అత్యుత్సాహంతో ప్రవర్తిస్తున్నారని న్యాయబద్ధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, చేవూరు విజయమోహన్ రెడ్డి, మీరా రెడ్డి, బత్తిని విజయకుమార్ బొమ్మిడి శ్రీనివాసులు మల్లు విజయకుమార్ రెడ్డి, నాగరాజు, మధుసూదన్ రెడ్డి, మగ్దూం మొహిదీన్, రాజేష్ సుబ్బారావు, మురళి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు మండల పరిధిలోని తిప్పవరపాడు గ్రామంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మెట్ట రాధాకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మకుటం లేని మారాజు, పేదల సిఎంగా, బడుగు బలహీన వర్గాల అభ్యునతే లక్ష్యంగా ఆయన తుది శ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వైఎస్ఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో పశుగ్రాస వారోత్సవాలు



**గూడూరు, జూలై 8, ప్రభాతవార్త :** గూడూరులోని ప్రాంతీయ పశువైద్య శాలలో ఈ నెల 7వ తేది నుండి 14వ తేది వరకు పశుగ్రాస వారోత్సవం నిర్వహిస్తున్నట్లు డా. సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశు పోష కులకు పశుగ్రాసాల రకాలు ఏక వార్షికాలు ధాన్యపు జాతి మొక్కజొన్న, జొన్న, సజ్జ, యమ్.పి.చారి ఏక వార్షికాల పప్పు జాతి జనుము, అలసంద, స్టైలో, స్వీట్ పొటాటో బహు వార్షికాలు దాన్యపు జాతి పారాగడ్డి, సూపర్ నేపియర్, కో4, బుల్లెట్ నేపియర్. పప్పు జాతి స్టైల్ హెమాటా, స్టైలోస్కాబ్రా, సిరాట్రో, పశు గ్రాస వృక్షాలు సుబాబుల్, గ్లైరిసిడియా సాగు విధానం, పోషక విలువలు, దిగుబడి గురించి వివరంగా తెలిపారు. ప్రతి రైతు పశుగ్రాసాలు సాగు చేసి పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గించడంపై గూడూరు సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్య శాల డా. సురేష్ అవగాహన కల్పించి పశుగ్రాసంతో దాణా ఖర్చు తగ్గించు కోవాల్సిందిగా రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు బత్తిన శ్రీనివాసులు, సిబ్బంది లైవ్ స్టాక్ అసిస్టెంటు శ్రీనివాసులు, పట్టణ రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ఆర్

**– మర్రిపాడులో ఘనంగా వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు**



**మర్రిపాడు,జులై8,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మర్రిపా డులోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో దివంగత మహానేత , ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయ ంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదట వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ చెన్ను వెంకటే శ్వర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బొర్రా సుబ్బారెడ్డి, యువత మండల అధ్యక్షుడు చంద్ర నారాయణస్వామి, ఎంపిటిసి సభ్యులు హజరత్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.నాటి బాబు పాలనలో రైతులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్న క్రమంలో విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేవెళ్ళ నుంచి ఇచ్ఛాపురం వరకు 1450కి పైగా కిలోమీటర్లు పాదయాత్రచేసి రైతుల కష్టాలను చూసి వారిని ఓదార్చారని, అధికారంలోకి రాగానే రైతులకు ఉచిత కరెంటు ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా తొలి సంతకం దానిపైనేచేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయంబర్స్‌మెంట్ మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు, ప్రాణాపాయ పరిస్థితుల్లో 108,104 వాహనాల ఏర్పాటు అమలుతో దేశానికే ఆదర్శప్రాయంగా రాజశేఖర్‌రెడ్డి నిలిచారన్నారు. సమగ్ర సోమశిల సాధించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి సరఫరా స్థాయిని పెంచి సోమశిల జలాశయంలో తొలిసారి 78టిఎంసిల నీటిని నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆత్మకూరు,ఉదయగిరి నియోజకవర్గాలతోపాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగు,సాగునీటి సరఫరా కోసం ఉద్దేశించిన హైలెవల్ కెనాల్ రూపకర్తగా ఆయన నిలిచారన్నారు. ఆయన ఆశయాల సాధనకోసం కుమారుడు వైఎస్‌జగన్మోహన్‌రఎడ్డి మరో అడుగుముందుకేసి ఎన్నో సంక్షేమ పథకాలు, మహిళలకు ఆర్థిక స్వాలంబన అందించిన ఘనత సాధించారన్నారు. పేదల పెన్నిదిగా పారిశ్రామిక వర్గాలకు చేయూతనిస్తూ అండగా నిలిచిన రాజశేఖర్‌రెడ్డి కృషితో జిల్లాలో కృష్ణపట్నం పోర్టు, పవర్ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం శ్రీసిటి , మేనకూరు సెజ్ తదితరాలు ఏర్పాటు చేశారన్నారు. ఆయన పాలన ప్రజలకు పండుగలా ఉండేదని కొనియాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రజా నాయకుడని కొనియాడారు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి వేలక ఇలోమీటర్ల పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ,నిరుపేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, 104 వైద్యసేవలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇందిరమ్మ ఇళ్ళు, జలయజ్ఞం వంటి పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ఆర్ అని పేర్కొన్నారు. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధ్యానత ఇచ్చిన వైఎస్ఆర్ రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేశారన్నారు. సంగం , నెల్లూరు బ్యారేజీల నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టగా ఆయన ఆశయాలను కొనసాగిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి వాటిని పూర్తిచేశారన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతంరఎడ్డి సేవలను గుర్తించి సంగం బ్యారేజీకి ఆయన పేరు పెట్టగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆపేరును తొలగించడం దురదృష్టకరమన్నారు. వైఎస్ఆర్ ఆశయాలను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళుతున్నారని , ప్రజల సంక్షేమమే వైఎస్ఆర్ కుటుంబానికి ప్రధాన లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి మళ్ళీ వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ర్సాఇపి నాయకులు మాగంటి శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి కొండారెడ్డి, విద్యార్థి సంఘం నియోజకవర్గ మండల అధ్యక్షుడు బొర్రా విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, గంగినేని విజయ్‌కుమార్, సోషల్‌మీడియా కన్వీనర్ పొంగూరు సుధాకర్, ఓబుల్‌రెడ్డి, చిన్నారెడ్డి, కొండారెడినడ, రామకృష్ణారెడ్డి, ఖాదర్‌బాషా, బిసి సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, వెంకటేశ్వర్లు, కతినత పద్మారావు, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభునయలు, నాయకులు , కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమూర్‌రెడ్డి పరామర్శ



**కోట,జులై 8 ప్రభాతవార్త :** కోట మండలం చిట్టేడు గ్రామంలో వీర చెంచురామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమేరకు బుధవారం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమూర్‌రెడ్డి ఆయన నివాసంకు వేళ్లి చెంచురామయ్య తనయుడు చీర రవిని పరామ ర్శించారు. చెంచురామయ్య నల్లపరెడ్ల కుటుబంకు వీదేయుడుగా ఉండేవారు.నల్లపరెడ్లుకు నమ్మిన బంటుగా ఉంటూ సేవలు అందించారు.ఆమేరకు ప్రసన్న కుమూర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాడ సంపతాం తెలిపారు. వారు వెంట నల్లపరెడ్డి గీతారెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమూర్‌రెడ్డి, నల్లపరెడ్డి పూజారెడ్డి, కోట మాజీ ఉప సర్పంచ్ బాస్కర్ ఉన్నారు.కాగా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చిట్టేడుకు వచ్చిరన్న విషయం గ్రామంలో తెలియడంతో ఆయనను చూసేందకు ఒక్క సారిగా నల్లపరెడ్డి అభిమానులు ఆయన వద్దకు చేరుకుని అబివాదం చేశారు. నల్లపరెడ్ల కుటుంబంకు చిట్టేడు గ్రామం కంచు కోటగా చెప్పవచ్చును.

## ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర



**కోట, జూలై 8 ప్రభాతవార్త :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు కోటలో ఘనంగా జరిగాయి. కోట క్రాస్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆకాశ గంగను పుడమిపైకి తెచ్చిన అపర భగీరధుడు, వర్షపు నీటిని ఒడిసి పట్టి బంజరు భూములకు మళ్లించి బంగారు భూములుగా మార్చిన జలయజ్ఞికుడు, భావితరాల భవిష్యత్‌ను ఆకాంక్షించి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో కొత్తపుంతలు తొక్కిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. అనంతరం పాదర్తి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ 1978లో పులివెందుల శాసనసభ్యునిగా తొలిసారి ఎన్నికై, అప్పటి నుంచి ఆరుసార్లు శాసనసభ్యునిగా, నాలుగుసార్లు కడప ఎంపీగా విజయం సాధించారని పేర్కొన్నారు. కోట్లాది మంది గుండెచప్పుడుగా నిలిచిపోయారని చెప్పారు. ఆరోగ్యశ్రీతో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించారని, ఈ పథకం దేశంలోనే సంచలనంగా మారిందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం ద్వారా రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో దోహదపడ తుందన్నారు. అత్యవసర వైద్య సహాయం కోసం 108 అంబులెన్స్‌లు, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. జెడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య, మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర, మధురెడ్డి, రేష్మా, సుధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపాళెంలో పొదుపు మహిళాలు ర్యాలీ



**కోట,జులై 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాలెంలో బుధవారం ఐకెపి ఎపిఎం అనిల ఆధ్వర్యంలో పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహిం చారు. మనడబ్బులు, మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా గ్రామ పుర వీదుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల మాట్లాడుతూ పొదుపు మహిళాలు తీసుకున్న రుణం కు సభ్యుల వద్ద లేక్కలు ఇంకా నుంచి పక్కాగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి పైసా ఖర్చు చేసింది లేక్కలు అన్నీ జమతో సహా చరవాణీలకు సమాచారం వస్తుందిని వివరించారు. ప్రతి సభ్యురాలు తమ ఫోన్ ద్వారానే లావాదేవీలు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. ఇందుకు సంబందించి సూపర్ యూప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు.ప్రతి నెల క్రమం తప్పకుండా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. పొదుపు రుణం ఎంత తీసుకున్నారో ? ఇంకా ఎంత అప్పు ఉన్నారో ? ఇంకా ఎంత బాల్యెన్స్ ఉన్నారో అనే విషయాలు పూర్తిగా తెలుసుకొచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు బాస్కర్,ప్రసాద్, అలేవేలమ్మ,విఓలు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంటలో ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం



**బిట్రగుంట జులై 8 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం బుధవారం నిర్వహించారు.సమావేశంలో శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద దేవస్థాన అభివృద్ధి పనులు, సిబ్బంది జీతములు పెంపుదల, ప్రతి శనివారం కంటిన్యూగా ఉచిత ప్రసాదం వితరణ మరి ఇతర అంశములపై ధర్మకర్త మండలి సభ్యులతో సమావేశమై చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకొనుట జరిగినది.పై కార్యక్రమంలో చైర్మన్ , శ్రీరామ్ మాల్యాద్రి, ధర్మకర్త మండలి సభ్యులు మరియు కార్య నిర్వహణ అధికారి అరవ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి



**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త :** కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం తగు చొరవ తీసుకో వాలని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపా లెంలోని షుగర్ ఫ్యాక్టరీలో బుధవారం ఆయన కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులకు రూ. 10 లక్షలు ఇచ్చే విధంగా 2010వ సంవత్సరంలోనే ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 15 సంవత్సరాలు దాటినా దోపిడీకి గురైన కార్మికుల శ్రమకు ఫలితం దక్కకపోవడం బాధ కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం గుర్తించి 600 మంది కార్మికుల్లో 100 మందికి పైగా వేతనాల కోసం ఎదురుచూస్తూ మరణించారని, మరో 60 మంది అనారోగ్యంతో మంచంపై ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కోవూరు ఎమ్మెల్యే ఈ సమస్యపై అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వ అధికారులతో చర్చించినా నేటికీ వేతన బకాయిలు విడుదల కాకపోవడంతో ఆంతర్యం ఏమిటన్నారు. తీవ్ర అసంతృప్తికి లోనైన కార్మికులకు కారుణ్య మరణాలకు అవకాశం కల్పించమని విజ్ఞప్తి ఏస్తుంటే ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్య తీవ్రత ఎందుకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల జీవిత భద్రత కోసం రాష్ట్రంలోని ఐఎఎస్‌ల దృష్టికి తాము చేస్తున్న పోరాటాన్ని చట్టబద్దంగా తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి వెంటనే చట్టపరమైన వేతన బకాయిలను చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల బీజేపీ అధ్యక్షుడు సుబ్బారావు, నేతలు రఘురామయ్య, సుబ్బారెడ్డి, జయచంద్ర, ఆదినారాయణ, బీసీవై పార్టీ బుధవరపు బాలాజీ, సోమా గోపాల్‌లు ఉన్నారు.

## నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి



**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త :** కోవూరులోని రాళ్లమిట్టలో నూతనంగా నిర్మించిన శ్రీ భూదేవి శ్రీదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితులు నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు రజిత్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వీరి చలపతిరావు, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, శివుని నరసింహులురెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, తురకా భాస్కర్, అంకయ్య, శశికుమార్, బుజ్జమ్మ, రేణుకమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

## పథకాల సృష్టికర్త దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి



**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త :** కోవూరు మండల వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి 77వ జయంతి వేడుకలను కోవూరులోని మైథిలి సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు.పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మరలా సంక్షేమ రాజ్యం తప్పక వస్తుందని ప్రజానీకం కూడా ఎదురు చూస్తున్నారన్నారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక పథకాలు నేడు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ప్రతి పథకం ఒక సంచలనం సృష్టించి నేటికీ ప్రజల హృదయాల్లో పూర్తిస్థాయిలో కొలువైందన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నేత రాశేఖర్‌రెడ్డి చేపట్టిన పలు పథకాలు నేటికీ భారతదేశం అంతటా ఆదర్శంగా నిలిచిపోయా యని నేతలు పేర్కొన్నారు. ఆ వమనీయుడు పరిపాలించిన ఆ పది సంవత్సరాలు రాష్ట్రానికి ఒక స్వర్ణయు గంలా ఉందన్నారు. సంక్షేమం , అభివృద్ధి చేసిన చూపిన మహనీయుడు ఆయనే అన్నారు. అటువంటి వ్యక్తులు అరుదుగా పుడతారని, ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 2 సంవత్స రాలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న దాఖలాలు లేవన్నారు. గతంలో 5 సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన జగన్‌మోహన్‌రెడ్డి ఒక స్వర్ణయుగాన్ని సృష్టించారన్నారు. మరలా అటువంటి పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకుని శిబిరంలో ఏర్పాటు చేసిన మహానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన ప్రసాద్‌రెడ్డి



**కావలి, జులై 8 ప్రభాతవార్త :** కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ పదోన్నతిపై శ్రీకాకుళం కార్పొరేషన్‌కు బదిలీపై వెలుతున్న సందర్భంగా స్థానిక మున్సిపల్ అధికారులు బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మన్యం గోపాలక్రిష్ణయ్య, కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ నోటి ప్రపసాద్‌రెడ్డి పాల్గొని ఆయనకు పూలబొకే అందచేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో లోకసత్తా నాయకులు ఎం.మాలకొండారెడ్డి, నోటి ప్రసాద్‌రెడ్డి మిత్రులు పాల్గొన్నారు.

## నృసింహుని నిత్యాన్నదాన పథకానికి రూ.1.58 లక్షల విరాళం



**రాపూరు,జూలై 8, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి బుదవారం స్వామి వారి భక్తులు రూ.1.58 లక్షల విరాళాన్ని అంద జేశారు .పోదలకూరు మండలం అమ్మవా రిపాలెం గ్రామానికి చెందిన నాగినేని గోపాల కృష్ణ య్య, శ్రీమమతి పద్మ దంపతులు ఈ విరా ళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. స్వామి వారి నిత్యాన్నదానానికి విరాళం అందించిన దాతలకు ప్రత్యేకంగా స్వామి వారి దర్శనంతో పాటు వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రం అందజేశారు. శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి సేవలను సులభంగా బుక్ చేసుకు నేందుకు మన మిత్ర వాట్సాప్ సేవ 9552300009ను వినియోగించుకోవాలని ఆలయ ఇన్‌చార్జ్ ఇఓ కోవూరు జనార్ధన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది వెంకట సుబ్బయ్య, తదితరు లున్నారు.

## ఘనంగా వైఎస్సాఆర్ 77వ జయంతి వేడుకలు



**రాపూరు,జూలై 8, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో బుదవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట సిఈసి సభ్యుడు పాపకన్ను మధు సూధన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపకన్ను మధు సూధన్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకోని అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కోనియాడారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, పేదల అభ్యున్నతే ఆయన పాలన ధేయ్యమని,ఆయన ఆశయాలను నేటి తరానికి చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. తదుపరి రాపూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు స్వీట్లు ,బ్రెడ్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు మధుసూధన్ రెడ్డి, బత్తిన పట్టాభిరామి రెడ్డి,పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు వున్నారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వైఎస్సార్



**వెంకటాచలం జులై 8 ప్రభాతవార్త:** పేదల గుండెల్లో ఎప్పటికీ స్థిరస్థాయిగా నిలిచిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కిందని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు మండల వెంకటయ్య పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా వెంకటాచల ంలోని వైసీపీ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మానసిక వికలాంగుల కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం శేషయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఎంతోమంది ముఖ్యమంత్రి పాలించిన ఎవ్వరు చేయని విధంగా పేదల గుండెలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆరోగ్యశ్రీ 108 వంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల గుండెల్లో నిలిచారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ జలయజ్ఞం, వంటి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మోహన్ నాయుడు ఉప ఎంపీపీ కనుపూరు కోదండరాం రెడ్డి. మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ ప్రక్రియను జూలై 11లోగా పూర్తి చేయాలి

**: నాపా వెంకటేశ్వర్లు నాయుడు**



**కొడవలూరు, జూలై 8 ప్రభాతవార్త:** రాష్ట్ర పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనలతో బుధవారం కొడవలూరు గ్రామంలో టీడీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రతి రెండో బుధవారం నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు.టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ, మండలంలోని అన్ని బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి జూలై 11లోగా పూర్తి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నిదానంగా సాగుతున్న బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు సానుకూలంగా స్పందిస్తూ గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి, గుండాలంపాలెం సొసైటీ అధ్యక్షుడు వినీల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ్, నీటి సంఘం అధ్యక్షుడు జొన్న శివకుమార్, తలమంచి సొసైటీ డైరెక్టర్ నక్కల రవి, భూలోక విజయ్‌కుమార్, కరకట మల్లికార్జున, కొడవలూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ భాషా, ఐటీడీపీ మండల అధ్యక్షుడు కోవూరు వెంకీ, గుండాలంపాలెం సొసైటీ డైరెక్టర్ పంది శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు భాషా, రహీం, యూనిట్ ఇన్‌చార్జి బాబీ, ఎస్‌కే నాయబ్ రసూల్, విజయ్‌కుమార్, ఆటో యూనియన్ అధ్యక్షుడు విల్సన్, శ్రీనివాస్ యాదవ్, షాజహాన్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడువులోగా డిజిటైజేషన్ పూర్తి చేయాలి

**– తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూలై 8 ప్రభాతవార్త:** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు సేకరించిన ఈఎఫ్‌ల డిజిటైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి లక్ష్యాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.మండలంలో మొత్తం 41,244 మంది ఓటర్లు ఉండగా, 40,119 ఈఎఫ్‌లను పంపిణీ చేసి, 39,875 ఈఎఫ్‌లను తిరిగి సేకరించారు. ఇప్పటివరకు 24,861 ఈఎఫ్‌లను డిజిటైజ్ చేయడంతో 60.27 శాతం పురోగతి నమోదైనట్లు తెలిపారు.క్లస్టర్ల వారీగా ఎస్‌ఏ–ఎంపీడీవో కార్యాలయ పరిధిలో 67.34 శాతం, జేఏసీఏ పరిధిలో 62.49 శాతం, ఎస్ఏ పరిధిలో 71.05 శాతం,ఏఓ–ఎంపీడీవో కార్యాలయ పరిధిలో 58.12 శాతం, కొడవలూరు క్లస్టర్‌లో 50.22 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు.మిగిలిన ఈఎఫ్‌ల డిజిటైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతోపనిచేయాలని ఆమె సూచించారు. అలాగే ఓటర్లు అవసరమైన వివరాలు, పత్రాలను సకాలంలో అందించి సహకరించాలని కోరారు.

## జమ్మలపాలెం నూడ లేవుట్‌ని సుందరంగా తీర్చిదిద్దుతా

### నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



**కావలి, జులై 8 ప్రభాతవార్త :** కావలి సమీపంలోని జమ్మపాలెం వద్ద ఉన్న నుడ లేవుట్‌ని అదునాతన వసతులతో సుందరంగా తీర్చిదిద్ది మూడు నెలల్లోనే లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా లేవుట్లల్లో రుగుతున్న పలు పనులను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు. గత వైపిసి పాలనలో ఈ లేవుట్‌కు రూ.26కోట్లు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.12కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని పలు అక్రమాలు కూడా చోటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. తాను కూడా ఛైర్మెన్ అయిన తరువాత మంత్రి నారాయణ సహకారంతో ఈ లేవుట్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే విద్యుత్ పనులు పూర్తి అయి రోడ్డు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. లబ్దిదారులైన ఉద్యోగులు లోన్స్ సౌకర్యం కల్పించాలని కోరడం జరిగిందని దానిని మూడు నెలల్లోనే పూర్తిచేసి లబ్దిదారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, లబ్దిదారులు బొట్లగుంట హరిబాబు, రమేష్‌రెడ్డి, తదితర లబ్దిదారులు, నుడా అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన టిడిపి నేతలు



**కావలి, జులై 8 ప్రభాతవార్త :** కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ పదోన్నతిపై శ్రీకాకుళం కార్పోరేషన్‌కు బదిలీపై వెలుతున్న సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, 10వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్టణ 2వ క్లస్టర్ కో ఇన్‌చార్జ్ వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, 12, వార్డు ఇన్‌చార్జ్ దావులూరి దేవకుమార్, టిడిపి నేతలు అక్కిలిగుంట సూర్యప్రకాష్, బొల్లావేణు తదితరులు పాల్గొని ఆయనకు పూల బొకే అందేసి దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించి అభిమానాన్ని చాటుకోవడం జరిగింది.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే స్త్రీ నిధి లక్ష్యం: ఏపిఎం అనిల



**కోట, జూలై 8 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో అన్ని రకాలుగా వారికి రుణాలు అందించడమే స్త్రీ నిధి ముఖ్య ఉద్దేశమని ఏపిఎం అనిల తెలిపారు. బుధవారం ఆమె 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ మహిళల జీవనోపాధులు, వ్యాపారాభివృద్ధిలో రాణించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా రుణాలిస్తుందన్నారు. రుణ శాతాన్ని ప్రభుత్వం పెంచుతుందన్నారు. పెరిగిన నిధులతో మహిళలు తమ జీవనోపాధి మెరుగుపరచుకుని ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. స్వల్పకాలిక రుణం రూ.10 వేలను ఏడాది కాలం చెల్లించవచ్చని తెలిపారు. సూక్ష్మ రుణం కింద రూ.50 వేలు 24 నెలల్లో చెల్లించవచ్చని తెలిపారు. 50 వేలకు పైబడి తీసుకున్న రుణం మూడేళ్లలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. మంజూరైన రుణానికి బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కొత్త విధానంలో పదిమంది సభ్యులకు రూ.16 లక్షల రుణం పొందవచ్చన్నారు. పారిశ్రామికవేత్తలుగా స్వయం ఉపాధి పొందుతున్న ముగ్గురికి రెండు లక్షలు చొప్పున రూ.6 లక్షలు ఇస్తారని చెప్పారు. కుటుంబ జీవనోపాధి కోసం రూ.10 లక్షలు ఇస్తారన్నారు. రుణం మంజూరులో చెల్లింపుల్లో విఓఏ లాగిన్ ద్వారా చరవాణిలో డిజిటల్ చెల్లింపు ఉంటుందన్నారు. కోట, చిల్లకూరు, గూడూరు మండలాలకు 44 కోట్ల రూపాయలను స్త్రీ నిధి రుణాల కింద ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వైయస్సార్ జయంతి



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – అగ్రికల్చర్** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైయస్సార్ 77వ జయంతిని నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, ప్రధాన కార్యదర్శి కే. సంజయ్ కుమార్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.నెల్లూరులోని మూలపేట సిఏఎం హై స్కూల్ కూడలిలో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికివారు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా, నిబద్ధత కలిగిన కాంగ్రెస్ వాదిగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఆయనను ప్రత్యేక స్థానంలో నిలిపాయని కొనియాడారు. వైయస్సార్ హయాంలో ప్రారంభించిన సంక్షేమ పథకాలు నేడు కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఇర్ఫాన్ మాట్లాడుతూ వైయస్సార్ ఆశయాలను నిలబెట్టే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. లీగల్ సెల్ అధ్యక్షులు వి. సుదీర్ మాట్లాడుతూ ప్రజలకు సమన్యాయం అందించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. అనంతరం చాక్లెట్లు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ నేత మల్లికార్జున్ రెడ్డి, మల్లి కిషోర్ రెడ్డి, బుచ్చి కిషోర్ షేక్ హనీ సేవాదళ్ సుజాత, ఎన్ఎస్‌యుఐ నాయకులు రాజా, సుధాకర్ రెడ్డి, గిరీష్, ధనుంజయ్ షేక్ నుస్రత్, మున్నా, ముజీబ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి



**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త** :కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి బీఎల్వోలు వారికి కేటాయించిన ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా తగుచర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బీఎల్‌వోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో మృతిచెందిన ఓటర్లను తొలగించే విషయంలో సంబంధిత కుటుం బ యాజమాన్య సంతకంతో పాటు ఆ బూత్ లెవల్‌లో బీఎల్ఏ సంతకం కూడా తప్పక తీసుకోవాలన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఈ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏబీఎల్‌వో కూడా నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. సంబంధిత సూపర్‌వైజర్ కూడా ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి సాధ్యమైనంత వరకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేలా దృష్టి పెట్టాలన్నారు.

## వీపీఆర్ నేత్ర మహత్తర కార్యక్రమం





**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త :** వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో రూపు దిద్దుకున్న వీపీఆర్ నేత్ర కార్యక్రమం ఒక మహత్తర కార్యక్రమం అని పాటూరు నీటి సంఘం అధ్యక్షులు ఆదాల శివారెడ్డి తెలిపారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో బుధవారం వీపీఆర్ నేత్ర కంటి పరీక్షలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కనీసం పైసా ఖర్చు లేకుండా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటిపరీక్షలు నిర్వహించి ఉచి తంగా అద్దాలు కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వేమిరెడ్డి దంపతులు ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల హృదయాల్లో వారు నిలిచిపోయారన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు జిల్లాకు దొరకడం ప్రజలుచేసుకున్న అదృష్టమన్నారు. కంటి అద్దాలను పంపిణీ చేశారు. కూటమి నేతలు గునపాటి రవీంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరిబాబు, పులి సురేష్, వంశీ, శీనయ్య, గ్రామస్తులు ఉన్నారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్




**కోవూరు, జూలై 8 ప్రభాతవార్త** :కోవూరులోని మైథిలి సెంటర్‌లో బుధవారం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసి ఉన్న మహా నేత వైఎస్సార్ చిత్రపటానికి మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహానీయుడు చేసిన సంక్షేమపాలనను గుర్తు చేసుకున్నారు. వైసీపీ యువజన అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పార్టీ సీనియర్ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, జి. మల్లికార్జున, నాగరాజు, వై. మీరారెడ్డి, శివకుమార్, పాటూరు మోహన్, జుబేర్ బాషా, శ్యామాచార్యులు, సుబ్బారెడ్డి, గౌతమ్ స్వీట్స్ అధినేత సుధాకర్‌రెడ్డి, హరిరెడ్డి, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## పట్టణ ప్రజల సహకారం మరువలేనిది: మున్సిపల్ కమిషనర్



**కావలి, జూలై 8 ప్రభాతవార్త** : కావలి పట్టణ ప్రజలు ఎంతో సౌమ్యులని వారి సహకారం మరువలేనిదని కావలి మున్సిలప్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించి శ్రీకాకుళం కార్పోరేషన్ కమిషనర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెలుతున్న జి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక మన్యం గోపాలక్రిష కళ్యాణ మండపంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయనను పలువురు పూలమాలలు, దుశ్యావాలలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజల అధరాభిమానం మరువలేనిదని తెలిపారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంత పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పలు సమస్యలను కూడా తీర్చడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డును కూడా పొందడం జరిగిందన్నారు. అన్ని విభాగాల్లో కూడా మెరుగైన ఫలితాలను సాధించడం జరిగిందన్నారు. స్వచ్ఛసర్వేక్షణలో రాష్ట్రంలో 12వ స్థానంలో పట్టణం నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎలీసాబాబు, మున్సిపల్ డిఈఈ సాయిరాం, మేనేజర్ పనికుమార్, టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, పటటణ 12వ వార్డు ఇన్‌చార్జ్ దావులూరి దేవకుమార్, కాంట్రాక్టర్ నోటి ప్రసాద్‌రెడ్డి, లోక్‌సత్తా మాలకొండరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన ఎమ్మెస్సార్ విద్యార్థులు



**కావలి, జూలై 8 ప్రభాతవార్త :** విక్రమసింహపురి యూనివర్శిటి విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరోసారి తమ సత్తా చాటారు. వివిధ కోర్సులకు చెందిన విద్యార్థులకు విశిష్ట సీజీపీఏలు సాధించి కళాశాల విద్యాప్రమాణాలను మరోసారి చాటిచెప్పారు. ఈ ఫలితాలపై కళాశాల యాజమాన్యం అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బుధవారం అభినందించారు. ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో కలిదాసు మాధురి బిఎస్‌సి కెమిస్ట్రీ 9.64, సీజీపిఏతో కళాశాల ప్రథమ స్థానంలో నలిచి, మోర్ల వర్షిత బీకాం (కంప్యూటర్స్)లో 8.40తో ద్వితీయస్థానం, ఎస్‌కె.హాఫిజున్నిసా బిఎస్సీ కంప్యూటర్స్‌లో 9.29తో తృతీయస్థానం, సంతోష్ అక్షిత డేటాసైన్స్‌లో 9.25తో నాల్గవ స్థానం, బి.రమ్య,బీకాం కంప్యూటర్స్‌లో 9.11తో ఐదవస్థానం, డి.కీర్తన బికాం కంప్యూటర్స్‌లో 9.06తో ఆరవస్థానం సాధించి కళాశాలకు కీర్తి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు కళాశాల పేరు ప్రతిష్టలను పెంచాయన్నారు. ఇదే పటుదలతో ఉన్నత విద్య పోటీపరీక్షలు ఉద్యోగ రంగాల్లో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన తటపర్తి అమర



**కావలి, జూలై 8 ప్రభాతవార్త** :కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ పదోన్నతిపై శ్రీకాకుళం కార్పోరేషన్‌కు బదిలీపై వెలుతున్న సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటపర్తి రమేష్, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు, మూడవ క్లస్టర్ ఇన్‌చార్జ్ అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తలు ఆయనను కలసి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కావలి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ది చేసిన విధానాన్ని ప్రశంసించండ జరిగింది.

## కావలిలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు





**కావలి, జూలై 8 ప్రభాతవార్త :** నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా బుధవారం వైసిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్‌కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్ఆర్ చేసిన సేవలను స్మరించుకుంటూ వాటిని మరువలేనివని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టి పథకాల్లో ముఖ్యంగా రైతులకు ఎన్నో సంక్షేమ పతకాలు, 108, ఫీజు రీయంబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ, వ్యవసాయం కోసం ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. తండ్రికి తగ్గ తనయునిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు పొందారని తండ్రి ప్రవేశపెట్టిన పథకాలు తనయుడు కొనసాగిస్తూ పేరు ప్రఖ్యాతలు పొంది రాష్ట్ర ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, జడ్పిటిసి సభ్యులు జంపాని రాఘవులు, వైసిపి నాయకులు షేక్‌రాహుల్‌హమీద్, కనపర్తి రాజశేఖర్, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, మండలి క్రిష్ణారావు, అక్కిటిగుంట మల్యాద్రి, వాయిల తిరుపతి, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణ సేవా సంకల్పం

**- పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యం**
**- నెల్లూరు 49వ డివిజన్‌లో నారాయణ ఆన్ వీల్స్**
**- ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన**
**- అప్రతిహతంగా సాగుతున్న సేవా యజ్ఞం**
**- 9,617 మందికి కంటి పరీక్షలు, 6,257 మందికి దంత వైద్యం**
**- మంత్రి నారాయణ హెల్త్ క్యాంప్‌కు జనం జేజేలు**



**నెల్లూరు, జూలై 8, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు నగరంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఉన్నత ఆశయంతో, నిరుపేద, మధ్యతరగతి ప్రజల కోసం ఏర్పాటు చేసిన నారాయణ నేత్ర జ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత మెగా హెల్త్ క్యాంప్ 49వ డివిజన్లో దిగ్విజయంగా జరుగుతుంది. ఈ సందర్భంగా కోర్పొరేటర్ ఖాదర్ బాషా, ప్రెసిడెంట్ ప్రసాద్, వైద్యాధికారులు డా క్టర్ సుధ, రఫీ మాట్లాడుతూ కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరుపేదల ముంగిటకే తెచ్చేందుకు మంత్రి 3 కోట్ల వ్యయంతో అత్యాధునిక నారాయణ ఆన్ వీల్స్ మొబైల్ క్లినిక్ వాహనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సేవా యజ్ఞంలో భాగంగా ఇప్పటివరకు నారాయణ నేత్ర జ్యోతి ద్వారా 9,617 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 5,461 మందికి పైగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశామని, అలాగే తీవ్రమైన దృష్టి లోపాలతో బాధపడుతున్న 143 మంది రోగులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కంటిచూపును పునరుద్ధరించడం జరిగిందని వెల్లడించారు. దీనితో పాటు నారాయణ దంత సురక్ష విభాగంలో ఇప్పటి వరకు 6,257 మందికి నాణ్యమైన దంత పరీక్షలు నిర్వహించామని వారు పేర్కొన్నారు. గతంలో ఉచిత వైద్య శిబిరాల పట్ల ప్రజల్లో కొంత అపనమ్మకం ఉన్నప్పటికీ, ఇక్కడ కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో నిపుణులైన సీనియర్ డాక్టర్లు ప్రతి ఒక్కరినీ ఆప్యా యంగా పలకరిస్తూ నిశితంగా పరీక్షలు నిర్వహిస్తుండటంతో ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి క్యాంప్‌లోనూ వైద్యుల ప్రత్యేక శ్రద్ధ కోసం 60 మందికి మించకుండా పరీక్షలు చేస్తున్నామని, కంప్యూటర్ కంటి పరీక్షలు చేసి కేవలం ఒకటి లేదా రెండు రోజుల్లోనే రోగులకు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. అంతేకాకుండా మధుమేహం ఉన్నవారికి దయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా వంటి సమస్యలపై అవగాహన కల్పిస్తూ అంధత్వం రాకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని వివరించారు. ప్రజల ఇళ్ల వద్దకే ఈ ఉచిత సేవలు అందుతుండటంతో పేదలకు సమయం, వేలాది రూపాయల డబ్బు ఎంతో ఆదా అవుతోందని, మంచి చేయాలనే తపన ఉన్న నాయకుడు మంత్రిగా ఉంటే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో చెప్పడానికి నారాయణ చొరవే నిదర్శనమని కొనియా దుతూ డివిజన్ ప్రజల తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్పొరేటర్ షేక్ ఖాదర్ బాషా, ప్రెసిడెంట్ బండి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ నారా శ్రీనివాసులు, యూత్ ప్రెసిడెంట్ కరిముల్లా, యూనిట్ ఇంచార్జ్ ముజీబ్, కన్వీనర్ పవన్, మహిళా సెక్రెటరీ లక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారం నింపితేనే ఓటు: తహసీల్దార్ కె.జయజయరావు



**కోట,జులై 8 ప్రభాతవార్త** సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను పూరించి నిర్ణీత గడువులోగా ప్రతి ఓటరు తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారికి సమర్పించాలని కోట మండల తహసీల్దార్ కె.జయ జయరావు,ఎంపిడివో ఆర్.దిలీప్ కుమార్‌లు సూచించారు. ఆయన బుధవారం కోట పంచాయతీ కార్యాలయంలో జరు గుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14 వ తేదీలోపు ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందించాలన్నారు. లేని పక్షంలో ఆగస్టు 22 న ప్రచురించి ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో డిజిటలైజేషన్ ముమ్మరంగా జరుగుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకలకు అనుగుణంగా సర్ ప్రక్రియ ను పూర్తి చేయాలని ఆయన కోరారు.డిజిటలైజేషన్‌కు మరో ఐదు రోజుల మాత్రమే సమయం ఉందన్నారు. ఇప్పటికే 64 శాతం 25086 ఫారాలను డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. కోట పంచాయతీలో ఫారాలను తీసుకోవడంలో బిఎల్ఓలు వెనకబడి ఉన్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి, ఎన్.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడు వైఎస్ఆర్

### జిల్లా మున్సిపాల్టీ విభాగం అధ్యక్షురాలు షేక్ షకిలాబేగం



**బుచ్చి జూలై 8 ప్రభాతవార్త** సంక్షేమం, అభివృద్ధి అనే పదాలకు నిర్వచనం చెప్పిన మహోన్నత వ్యక్తి చిరస్మరణీయుడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని షేక్ షకిలాబేగం కొనియాడారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్‌లో జిల్లా మున్సిపాల్టీ వైసిపి విభాగం అధ్యక్షులు షేక్ షకిలా బేగం ,మహిళ నాయకురాలు మోర్ల జయంతి, తేజా తదితరులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంటౌన్ అధ్యక్షులు షేక్ షాహుల్,రూరల్ అధ్యక్షులు చెర్లోసతీష్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.ఈ సందర్భంగా షకిలా బేగం మాట్లాడుతు ప్రజలు కష్టాలు తెలుసుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుండి మహాప్రస్దానం పాదయాత్ర 1475 కిలోమీటర్లు ఇచ్చా పురం వరకు నడిచి ప్రజల కష్ట నష్టాలు తెలుసుకున్నా నేత వైఎస్ఆర్ అని ఆమె కొనియాడా రు. ముఖ్యమంత్రి అయిన వెంటనే 108, 104, ఆరోగ్యశ్రీ, పీజురియంబర్స్ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఆదర్శ ముఖ్యమంత్రి అయ్యారని ఆమె కొనియాడారు. తండ్రికి తగ్గ తనయుడుగా జగన్‌మోహన్‌రెడ్డి గత 5 సంవత్సరాలు అద్భుత పాలన అందించారని ఆమె ప్రశంసించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయాలు,ఆర్‌బికె భవనాలు, మల్టిపరపస్ గౌడౌన్లు కట్టించారని ఆమె కొనియాడారు. దేశ వ్యాప్తంగా రానున్న ఎన్నికలలో జగన్‌మో హన్‌రెడ్డి సిఎం కావడం తద్యమని, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయవం సాధించడం తథ్యమని అన్నారు.ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు కడివేటి శ్రీనివాసులు, అవినాష్‌రెడ్డి, బిట్రగుంటనారాయణ,తుమ్మల ప్రసాద్,చెల్లాయ పాళెం వెంకయ్య,రాజ్‌కుమార్,పోశింరెడ్డి శ్రీనివాసులురెడ్డి పలువురు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.



## నెల్లూరు నగరంలో రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు, జులై 8 ప్రభాతవార్త–విద్య** MLC పర్వ తరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తరలి వచ్చిన వం దలాదిమంది కార్యకర్తలు మహానేతకు ఘన నివాళి నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆం ధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూ జితమ్మ , నెల్లూరు నగర నియో జకవర్గ పరిశీలకులు కొండ్రెడ్డి రంగారెడ్డి తదితర నాయకులు పాల్గొని అ త్యంత ఘనంగా నిర్వహించా రు.ఆకాశాన్ని తాకే నినాదాలు, ఉప్పొంగిన అభిమానంతో వందలాది మంది పార్టీనాయ కులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి హాజరై "జోహార్ వైఎస్సార్" అంటూ మహా నేతకు ఘననివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన సేవలను స్మరించు కున్నా రు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశంలోనే ప్రజా సంక్షేమాన్ని పాలనకు కేంద్రబిందువుగా తీసుకుని విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసిన నాయ కుడు వైఎస్సార్ అని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందు బాటులోకి వచ్చిందని, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా లభించేలా చేశారని తెలిపారు.అలాగే 108, 104 అత్యవసర వైద్య సేవలు, జల యజ్ఞం ద్వారా సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో గ్రామీణా భివృద్ధికి వైఎస్సార్ విశేష కృషిచేశారని చెప్పా రు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు, గ్రామ/ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, చేయూత, ఆసరా, కాపు నేస్తం వంటి సంక్షేమ కార్యక్రమాలతో పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైఎస్సార్ అందించిన ప్రజాకేంద్రిత పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. నెల్లూరు నగర నియో జకవర్గంలో వందలాది మంది కార్యకర్తల సమ క్షంలో మహానేతకు ఘన నివాళులు అర్పించడం, ఆయన సేవలను స్మరించుకోవడం గర్వకారణమని తెలి పారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నా యకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శక్తి సూపర్ లేవన్ జట్టుకు లక్ష రూపాయలు బహుమతి



**చిల్లకూరు, జూలై 8, ప్రభాతవార్త** మండల పరిధిలోని తూర్పు కనుపూర్ గ్రామంలో లెవన్ నియోజకవర్గ క్రికెట్ మ్యాచ్ తూర్పు గ్రామంలో గత 15 రోజుల నుండి హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. అయితే బుధవారం ఫైనల్‌కి వచ్చినటువంటి డివిఆర్ జట్టు, శక్తి సూపర్ లేవన్, జట్లు తలపడగా మొదటగా డివిఆర్ జట్టు ట్రాస్ గెలుచుకొని ఫీల్డింగ్ ఎంచుకోగా శక్తి సూపర్ లెవన్ జట్టు 10 ఓవర్లలో 98 పరుగులు చేపట్టటం జరిగింది. అయితే డివిఆర్ జట్టు 10 ఓవర్‌లలో 79 పరుగులుతో ఓటమి పాలు అయింది. మొదటి బహుమతిగా శక్తి సూపర లేవన్ జట్టుకి లక్ష రూపాయలు నగదు బహుమతి రెండవ బహుమతి డివిఆర్ జట్టుకు 50 వేల రూపాయలు నగదు బహుమతి ప్రముఖ పారిశ్రామికవేత తానంకి నానాజీ, రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో చకర యశ్వంత్, సురేష్, ఒబ్బాయి శివకుమార్, అన్నం మునిశేఖర్, ఆలయ ఈఓ నవీన్ కుమార్, మేకల కుమార్, చంద్రశేఖర్, ఒడూరు సత్యనారాయణ రెడ్డి, పెనుపోలు జానకిరామ్ రెడ్డి, నల్లం కృష్ణ, టీం సిబ్బంది పాల్గొన్నారు.

